

నిర్మలమ్మ ఇన్నాళ్లకు కరుణించారు. ఆదాయపు పన్ను పరిమితులను పెంచుతూ ఎట్టకేలకు పద్దులో పెద్ద పీట వేశా రు. పెరిగిన ఖర్చులకు తోడు ఎడాపెడా ఆదాయపు పన్ను వాతలతో వెన్ను విరిగిన ప్రభుత్వ, ప్రైవేటు జీవులకు ఊరట కల్పించారు. రూ.12 లక్షల వరకు వార్షిక ఆదాయానికి ఎలాంటి పన్ను కట్టక్కర్లేదని పార్లమెంట్ సాక్షిగా బడ్జెట్‌లో ప్రకటించారు. అటు వృద్ధులకూ నిర్మలమ్మ పద్దు వరాలు కురి పించింది. వడ్డీపై ఆదాయంతో పాటు అద్దెపై వచ్చే వార్షిక ఆదాయ పరిమితిని పెంచి వారిని ఆకట్టుకుంది. అన్నదాత లకు కిసాన్ క్రెడిట్ కార్డుల రూపంలో అప్పు పరిమితి పెంచిం ది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కు నిధులు విదిల్చి ఉమ్మడి జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో సాగు చేస్తోన్న రైతులకు తీపికబురు అందించింది. అటు చిన్న తరహా పరిశ్రమలకు ఊతమిస్తూనే కాకినాడ కేంద్రంగా ఉన్న షిప్ బిల్డింగ్ రంగం మరింతగా ఎదిగేలా వెన్నుదన్నుగా నిలిచింది. వెరసి కేంద్ర బడ్జెట్ అన్నివర్గాలను మెప్పించి మురిపించింది. - (కాకినాడ, ఆంధ్రజ్యోతి)



వేతన జీవులకు ఊరట

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను మురిపించింది. ఎప్పుడూ వాతలతో సాగే బడ్జెట్ ఈ దఫా కొన్ని వరాలతో మెప్పించింది. ప్రధానంగా ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలంటూ ఎన్నో ఏళ్లుగా వేతన జీవులు వేడుకుంటున్నా కనికరించని ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈ సారి మొర విన్నారు. ఏకంగా రూ.12 లక్షల వార్షికాదాయం వరకు ఒక్క రూపాయి పన్ను కూడా చెల్లించక్కర్లేదని ప్రకటించి ఉద్యోగులపై వరాల వాన కురిపించారు. ఈ నిర్ణయంతో రూ.12 లక్షల వార్షికాదాయం పొందుతున్న వారికి రూ.80 వేల వరకు పన్ను పోటు తప్పి జేబులో డబ్బు మిగల నుంది.ఈ నిర్ణయం వల్ల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 63 వేల మందికి లబ్ధి చేకూరనుంది. ప్రధానంగా వీరిలో 22 వేల మందికి వార్షిక వేతనం రూ.12 లక్షల వరకు వస్తోంది. వీరికి రూ.80 వేల వరకు మిగ లనుంది. మిగిలిన 41 వేల మంది ఉద్యోగులకు సైతం రూ.30 వేల నుంచి గరిష్టంగా రూ.65 వేల వరకు ప్రయోజనం కలగనుంది. అయితే కొత్త పన్ను విధానం కింద శ్లాబులను ప్రకటించడం కొంత గందరగోళానికి గురి చేసింది. దీని ప్రకారం రూ.4 లక్షల వరకు సున్నా పన్ను,రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు పన్ను 5 శాతం, రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 10 శాతం పన్ను శ్లాబు లను ప్రకటించారు. ఈ శ్లాబు ప్రకారం రూ.12 లక్షల వార్షిక వేతనం ఉన్న వారు పది శాతం పన్ను చెల్లించాల్సి ఉండగా దాన్ని సెక్షన్ 87ఏ రిబేట్ కింద బడ్జెట్‌లో మినహాయిం పునిచ్చారు.దీంతో పన్ను సున్నాగా మారింది. దీనికి తోడు స్టాండర్డ్ డిడక్షన్ సైతం కలిపితే రూ.12.75 లక్షల వార్షికా దాయం వరకు పన్ను చెల్లించ క్కర్లేదు.దీనికి ఒక్క రూపాయి పెరిగినా పన్ను పరిధిలోకి వచ్చేస్తారు.బడ్జెట్ నిర్ణ యం నేప థ్యంలో రూ.8 లక్షల వార్షిక వేతనం ఉంటే రూ.30 వేలు, రూ.9 లక్షలకు రూ.40 వేలు, రూ.10 లక్షలకు రూ.50 వేలు, రూ.11 లక్షలకు రూ.65 వేల వరకు పన్ను పోటు తప్పింది.



పంట పండింది..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2.30 లక్షల హెక్టార్లలో వరి సాగవు తోంది.మొత్తం 5.40 లక్షల మంది రైతులు సాగుచేస్తున్నారు.వీరికి పంట రుణాల కింద ఏటా రూ.7,150 కోట్ల వరకు వివిధ బ్యాంకులు అందిస్తు న్నాయి. అయితే బ్యాంకులు షరతులతో ఇబ్బందులు పెడుతున్నాయి.కౌలురైతులకు అప్పు పుట్టని పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్రం కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టి సాలీనా ఏడు శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణాలంది స్తోంది. ఏడాదిలోగా రుణం తిరిగి చెల్లిస్తే 3 శాతం వడ్డీ రాయితీ ప్రక టిస్తోంది.ఈ సదుపాయాన్ని ఉమ్మడి జిల్లాలో వరి,ఇతర వాణిజ్య పంటల సాగుకు సుమారుగా 70 వేల మందికిపైగా అన్నదాతలు వాడుకుంటు న్నారు. పశుసంవర్ధకశాఖ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 4,600 మంది రైతులు ఈ కార్డులు వినియో గిస్తున్నారు. బడ్జెట్‌లో ఇప్పు డు రూ.3 లక్షల రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంచడంతో వేలాది మంది అన్నదాతలకు ప్రయోజనం కలగనుంది. జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రానికి రూ.186 కోట్లు కేటాయించింది.ఈ నిధులు ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లాలో వేలాది మంది రైతులకు ఆర్థికంగా అండ కల్పించనుంది.జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ కింద ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షల ఎకరాలు సాగవుతోంది. ఇందులో కాకినాడ జిల్లాలోనే 45 వేల ఎకరాలు ఉంది.

- వేతన జీవులకు, వృద్ధులకు ఊరట
- రూ.12 లక్షల వరకు ఆదాయపు పన్ను జీరో
- ఉమ్మడి జిల్లాలో 1.50 లక్షలమందికి లబ్ధి
- వార్షిక వేతనం రూ.12.75 లక్షలున్నా నోట్యాక్స్
- వృద్ధులకు వడ్డీ, అద్దెలపై పరిమితుల పెంపు
- నేచురల్ ఫార్మింగ్‌కు రూ.186 కోట్లు
- కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంపు
- ఎంఎస్ఎంఈలకు రుణాల పెంపు
- 24 వేలకుపైగా చిన్న కంపెనీలకు ఊతం
- నౌకా రంగానికి భారీవరాలు
- ఉమ్మడి జిల్లాలో 3 డే కేర్ క్యాన్సర్ సెంటర్లు

నౌకాయానం..



నౌకల తయారీ రంగానికి ఈ దఫా బడ్జెట్‌లో కేంద్రం భారీగా ప్రోత్సా హకాలు ప్రకటించింది.దీంతో కాకినాడలో తయారవుతున్న నౌకలకు సంబంధించి ఆయా సంస్థలకు భారీ గా ఆర్థిక ప్రయోజనాలు చేకూరడంతో పాటు ఈ రంగం మరింతగా ఎదగడా ని కి అవకాశం ఏర్పడింది. వాస్తవానికి కాకి నాడలో శాన్ మెరైన్ సంస్థ నౌకల తయా రీలో పేరొందింది. భారీ నౌకల నుంచి మధ్య తరహా షిప్‌లు తయారు చేస్తోంది. అనేక మత్స్యకార సంస్థలు సైతం పెద్ద పెద్ద టగ్‌లు తయారు చేస్తున్నాయి. ప్రధానంగా నౌకల తయారీకి విదేశాల నుంచి ఎక్కువగా అనేక పరికరాలు దిగుమతి చేసుకోవాలి. ప్రస్తుతం వీటిపై సరాసరి 23 శాతం వరకు పన్ను వసూలు చేస్తు న్నారు.కానీ ఇకపై ఇది సున్నా. పదేళ్ల పాటు ఇది అమల్లో ఉండనుంది.నౌకల తయారీకి అయ్యే కోట్ల కొద్దీ ఖర్చుకు సంబంధించి ఆయా కంపెనీలు,సంస్థలు తెచ్చే రుణాలపై ఇంత వరకు సబ్సిడీ లేదు.ఈ బడ్జెట్‌లో ఏకంగా 20 శాతం ఫైనాన్స్ సబ్సిడీ ప్రకటిం చింది.నౌకల తయారీ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. నౌకల తయారీ భవిష్యత్తులో కాకినాడ కేంద్రంగా ఎదిగే అవకాశం ఏర్పడిందని శాన్‌మెరైన్ సంస్థ అధినేత అలీషా విశ్లేషించారు.

వృద్ధులకు వరాలు..



వృద్ధుల ఆదాయాన్ని సైతం వదలకుండా ఇన్నాళ్లు పన్ను పేరుతో జేబులు గుల్ల చేసేసిన కేంద్రం ఈ దఫా బడ్జెట్‌లో వారి చేతిలో డబ్బు లాక్కోకుండా ఎంతో కొంత మిగిలేలా నిర్ణయం తీసుకుంది. వృద్ధులు అర్జించే బ్యాంకు డిపా జిట్ల వడ్డీపై పన్ను మినహా యింపును పెంచింది. ప్రస్తు తం ఇది రూ.50వేలు ఉండ గా దాన్ని రూ.లక్షకు పెం చారు. అటు అద్దె ఆదాయంపై ఉమ్మడి జిల్లాలో అనేక మంది వృద్ధులైన ప్రభు త్వ, ప్రైవేటు రిటైర్డ్ ఉద్యో గులు జీవిస్తున్నారు. వీరికి కూడా నిర్మలమ్మ తీపికబురు అందించారు.వీరికి అద్దెపై వచ్చే వార్షికాదాయం రూ.2.40 లక్ష లు దాటితే చెల్లించాల్సిన పన్నును మినహా యించి రూ.6 లక్షలకు పెంచారు. దీంతో వందలాది మందికి మేలు కలగనుంది.

పిల్లలతో ప్రయోగాలే ప్రయోగాలు..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 170 వరకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్నాయి. కొత్త తరహా ప్రయోగాలు ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రం ఏటా వీటిని మంజూరు చేస్తోంది. ఒక్కో దానికి రూ.20లక్షల వరకు వెచ్చిస్తోంది. బడ్జెట్‌లో వీటికి కేంద్రం మరింత పెద్దపీట వేసింది. 50 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది.దీంతో ఉమ్మడి జిల్లాకు భారీగా ఈ ల్యాబ్‌లు మంజూరు కానున్నాయి. తద్వారామరిన్ని పాఠశాలల్లో సైన్స్‌పై విద్యార్థులు ప్రయోగాలు చేసే సౌలభ్యం పెరగనుంది.

క్యాన్సర్ రోగులకు తగ్గనున్న భారం



క్యాన్సర్ రోగులకు దీర్ఘకాలిక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గింపు ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో బాధితులకు ఊరట దక్కింది. ఖరీదైన మందులు కొనలేక ఆర్థికంగా చితికిపోతున్నారు.మందుల ధరలు దిగిరానుండడం ఊరటనివ్వనుంది. దేశ వ్యాప్తంగా డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో మూడు కేంద్రాలు ఏర్పాటు కానున్నా యి.ఈ కేంద్రాల్లో బాధితులకు వైద్యసాయం లభించనుంది.

చిన్న వాటికి పెద్ద ఊతం..

బడ్జెట్‌లో చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎం ఎస్ఎంఈ)కు రుణాలను రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పెంచారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికవేత్తలకు మేలు జరగనుంది.ఉమ్మడి జిల్లాలో 24 వేల వరకు చిన్నతరహా పరిశ్ర మలున్నాయి.బ్యాంకుల నుంచి రుణాలిస్తున్నా సరిపోవడం లేదు. దీంతో బయట నుంచి అప్పులు తెచ్చి నష్టపోతున్నారు. బడ్జెట్‌లో ప్రకటించిన రుణ పెంపు ప్రకటన మేలు చేయనుంది. అటు స్టార్టప్‌లకు రుణాలు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లకు పెంచేలా బడ్జెట్ లో ప్రకటించడం అనేక మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వెన్ను దన్నుగా లభించనుంది.



పోలవరం ప్రాజెక్టుకు భారీ ఊతం

బడ్జెట్‌లో పోలవరంపై కేంద్రం మరింత కనికరం చూపింది. చాన్నాళ్ళుగా మూలనపడిన ఈ ప్రాజెక్టును గట్టెక్కించే దిశగా శరవేగంగా నిధులు కేటాయిస్తూనే వచ్చారు. ఈ క్రమంలోనే కేంద్ర బడ్జెట్‌లోను పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్ల పద్దు చూపించారు. గడిచిన ఐదేళ్లలో ఇంత మొత్తంలో పోలవరానికి కేటాయించడం దాదాపు ఇదే ప్రథమం. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 2027 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా దీనికి కేంద్రం కూడా ఊతమిస్తూ వస్తుంది. తాజాగా 12 వేల కోట్ల రూపాయలు ఈ మధ్యనే కేంద్రం ప్రకటించగా ఇప్పుడు తాజాగా ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లోను ఐదు వేల కోట్లకుపైబడి కేటాయింపులు పేర్కొనడం పట్ల హర్షం వ్యక్తమవుతుంది. ఇంతకుముందే పోలవరం నిర్మాణానికి గ్రాంటు రూపంలో 12 వేల 157 కోట్ల రూపాయలు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీకి రూ.54 కోట్లు కేటాయించారు.ఈ నేపథ్యంలో పోలవరం పూర్తి కావడానికి ఇక ఆటంకాలు లేవనే పరిస్థితి ఉంది. ఇక ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగేందుకు ఒకవైపు విడుదల చేసిన గ్రాంటు, మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు బట్టి చూస్తే ఇట్టే అవగతమవుతుంది.

అన్ని వర్గాలకు ఆశాజనకం



కలెక్టరేట్(కాకినాడ): కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు ఆశాజనకంగా ఉంది. రూ.12లక్షల పరిమితి వరకు ఆదాయ పన్నుమినహాయింపు ప్రశంసనీ యం. పోలవరంతోపాటు విశాఖ ఉక్కు, విశాఖ పోర్టులకు నిధులు కేటాయించడం శుభపరిణామం.

-కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

ఇది వికసిత్ భారత్ బడ్జెట్



వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డుల రుణం రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెంపు, రూ.12 లక్షల వరకు ఆదాయపపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయం.

- వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి

మధ్య తరగతికి భారీ ఊరట



సర్పవరం జంక్షన్: కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకుభారీగా ఊరటనిచ్చేలాఉంది. పోలవరం నిర్మాణ వ్యయాన్ని సవరించేందుకు కేంద్రంఅంగీకరించడం, ప్రాజెక్టు వ్యయం రూ.30,346కోట్లు, 411.15 మీటర్ల ఎత్తులో నీటి నిల్వలకు అంగీకరించడం హర్షణీయం.

-సానా సతీష్‌బాబు, రాజ్యసభ సభ్యులు, కాకినాడ

మురిపించిన కేంద్ర బడ్జెట్



కలెక్టరేట్(కాకినాడ): కేంద్ర బడ్జెట్ మురిపించింది. ధనధాన్య యోజనతో దేశంలో వెనుకబడిన జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం ఇచ్చారు. రూ.12 లక్షల వరకు ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపు పేద, మధ్య తరగతి ప్రజలకు ఉద్యోగస్తులకు ఊరట ఇచ్చారు.

-ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

రాష్ట్ర అభివృద్ధికి సానుకూలం



సామర్లకోట: కేంద్ర బడ్జెట్ పేదలకు, మధ్యతరగతి ప్రజలకు ఉపయుక్తమైన నిర్ణయాలు తీసుకుంది. రూ.12లక్షల ఆదాయం వరకూ పన్ను చెల్లించకుండా వెసులుబాటు కల్పించింది. పోలవరానికి నిధుల కేటాయింపులు శుభపరిణామం.

-పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప



మోగనున్న పెళ్లి బాజాలు

- నేటినుంచి ముహూర్తాలు షురూ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదలైన వివాహాల సందడి

తునిరూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మాఘమాసం వచ్చేసింది. దీంతో పెళ్లిగడియలు రానేవచ్చాయి. మాఘమాసంలో వివాహ ముహూర్తాలకు ఒక ప్రత్యేకత ఉంటుంది. ఈ సీజన్‌లో పెళ్లిళ్ల చేసుకునేందుకు వధూవరుల కుటుంబాలు ఆసక్తి కనబరుస్తారు. వాతావరణం అనుకూలంగా ఉండడంతోపాటు పంటలు చేతికి వచ్చి విరామ సమయంగా ఉండడంతో మాఘమాసంలో పెళ్లిళ్లకు అనువైన సమయంగా భావిస్తుంటారు. ఇప్పటికే ఈ మాసం ప్రారంభం కావడంతో వివాహాలు ఊపందుకున్నాయి. దీంతో శనివారం నుంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. మూడునెలలపాటు పెళ్లిళ్ల సీజన్ కొనసాగనుండడంతో స్థానిక మార్కెట్‌లతోపాటు మండపాలు కళకళలాడుతున్నాయి. ఈ సీజన్ వచ్చిందంటే పాన్‌షాపుల నుంచి వస్త్ర, బంగారు దుకాణాలకు అన్నింటికి గిరాకీ ఉంటుంది. కల్యాణ మండపాలు, అలంకరణ, లైటింగ్, సౌండ్ సిస్టమ్, పూల అలంకరణలు, బ్యూటీషియన్, ఫొటో స్టూడియోలకు, ఇంకా పలురకాల మార్కెట్‌లకు చేతినిండా పని దొరుకుతుంది. ఉమ్మడిజిల్లాలో కల్యాణ మండపాలు 1000 వరకు ఉన్నాయి. ఇవన్నీ ఇప్పటికే బుకింగ్‌లతో నిండిపోయాయి. జిల్లాలో ప్రధాన పట్టణాలతోపాటు చిన్నచిన్న గ్రామాలు, కూడళ్లలో కూడా కల్యాణ మండపాలకు మంచి రోజులు రావడంతో అంతటా పెళ్లిళ్ల సందడితో హడావుడి నెలకొంది.

ముహూర్తాల తేదీలు

- ఫిబ్రవరి 2, 6, 7, 8, 12, 13, 14, 15, 16, 20, 22, 23
- మార్చిలో 1, 2, 7, 9, 12, 14, 15, 16
- ఏప్రిల్‌లో 9, 10, 11, 12, 17, 18, 20, 23, 29, 30
- మేలో 1, 7, 8, 9, 10, 11, 14, 15, 16, 17, 18, 21, 22, 28(జ్యేష్ఠ మాసం)


మహాశివరాత్రి ఉత్సవాలకు రాటముహూర్త పూజలు



రాటముహూర్తం పూజలు చేస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఈనెల 24 నుంచి మార్చి 1 వరకూ నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయంలో వివిధ ఏర్పాట్ల నిమిత్తం శనివారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా రాటముహూర్త పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, కొంతేటి భీమేశ్వరశర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ చైర్మన్



కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన కాకినాడ జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సుదీర్ఘకాలం ఇండియన్ రెడ్‌క్రాస్‌తో అనుబంధం కలిగి ఉండడంతోపాటు ఎనిమిదేళ్ల ఉమ్మడి తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల రెడ్‌క్రాస్ చైర్మన్‌గా వైడీ రామారావు విశిష్ట సేవలందించారన్నారు. ఆయన రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీకి చైర్మన్‌గా ఎన్నిక కావడం కాకినాడ జిల్లాకు గర్వకారణమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు.

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికలకు రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం


కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉపఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు కోరారు. కాకినాడ కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్‌వో వెంకట్రావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఈనెల 3 నుంచి 10వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 11న నామినేషన్లు పరిశీలన ఉంటుందన్నారు. ఈనెల 13న నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చునన్నారు. ఈనెల 27న పోలింగ్ ఉంటుందని, బ్యాలెట్ పేపర్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా తూర్పు, పశ్చిమగోదావరి ఉమ్మడి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి కాగా, ఏఆర్‌వోలుగా ఆయా జిల్లాల డీఆర్వోలు వ్యవహరిస్తారన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో 3,15,261మంది ఓటర్లు ఉన్నారన్నారు. పురుషులు 1,83,734మంది, స్త్రీలు 1,31,507మంది, 20మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారన్నారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12పోలింగ్ కేంద్రాలు ఉండగా 4664మంది ఓటర్లు ఉన్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలు, 64441మంది ఓటర్లు, ఏలూరు జిల్లాలో 62 పోలింగ్ కేంద్రాలు, 63692మంది ఓటర్లు, కాకినాడ జిల్లాలో 96 పోలింగ్ కేంద్రాలు, 70343మంది ఓటర్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 95 పోలింగ్ కేంద్రాలు, 64327మంది ఓటర్లు, పశ్చిమ గోదావరిజిల్లాలో 93 పోలింగ్‌కేంద్రాలు, 69884 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సమావేశంలో ఆప్ నుంచి కృష్ణమోహన్, బీఎస్పీ నుంచి అప్పారావు, బీజేపీ నుంచి రమేష్‌బాబు, టీడీపీ నుంచి సాయిబాబా, జనసేన నుంచి వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



పిఠాపురం 18వ వార్డు యాదవ వీధిలో కుళాయికి బిగించిన హెడ్



పిఠాపురం తిమ్మరాజు వీధిలో లీకు ఉన్న ప్రాంతంలో మార్చిన పైపు



తాగునీటి కుళాయిలకు మరమ్మతులు

- నీటి సరఫరా నిరంతర పర్యవేక్షణ
- లోటుపాట్లు గుర్తింపు
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదికలో వచ్చిన సమస్యలకు పరిష్కారం

పిఠాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చావేదికలో ప్రజలు ప్రస్తావించిన తాగునీటి సమస్యలను మునిసిపల్ సిబ్బంది పరిష్కరిస్తున్నారు. ఐదురోజులుగా వార్డుల్లో తాగునీటి సరఫరాను ఉదయం, సాయంత్రం పరిశీలించి లోటుపాట్లు గుర్తించి వాటికి మరమ్మతులు నిర్వహిస్తున్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకుగాను ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' పిఠాపురం పట్టణంలోని 18వవార్డు కుంతీమాధవస్వామి ఆలయంవద్ద నిర్వహించిన చర్చావేదికలో వార్డు ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా కుళాయిలు అలంకారప్రాయంగా మారడం, పబ్లిక్ కుళాయిల ద్వారా అంతంతమాత్రంగానే నీరు వస్తుండడం, పలు చోట్ల పైపులైన్లకు లీకేజీలు ఉన్నట్లు ప్రజలనుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఐదురోజులుగా ఇంజనీరింగ్, తాగునీటి సరఫరా విభాగం అధికారులు, సిబ్బంది వార్డులో ఉదయం, సాయంత్రం వేళల్లో పర్యటించి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాను పరిశీలించి లోటుపాట్లు గుర్తించారు. వార్డులో ఉన్న కుళాయిలన్నింటికీ హెడ్‌లు బిగించారు. నీరురాని చోట మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు. తిమ్మరాజువీధి, ఆవంత్స సోమసుందర్ వీధి తదితర ప్రాంతాల్లో పైపులైనుకు లీకులు ఉన్నట్లు గుర్తించి అక్కడ పైపులు మార్చారు. నీరు తక్కువగా వస్తున్న ప్రాంతాలను గుర్తించి వాటికి ప్రత్యేకంగా నీటి సరఫరాపై దృష్టిసారించారు. అన్ని ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేసి శివారు, ఎత్తు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పనులను మునిసిపల్ కమిషనర్ నామా కనకారావు, వార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ పర్యవేక్షించారు.

గోవిందా...హరిగోవిందా !


ప్రత్యేకాలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.62లక్షలు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి):కోనసీమ తిరు మల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవలద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.62 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

4న గోవిందమాల దీక్షాధారణ

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందమాల దీక్షాధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. ఈనెల 4 రథసప్తమి మంగళవారం శ్రీనివాస శరణాగత దీక్ష ప్రారంభిస్తున్నట్లు, 24 రోజులపాటు దీక్ష ప్రారంభిస్తారని 26తో దీక్ష ముగిస్తుందన్నారు. మాలధారణ చేపట్టే భక్తులకు దేవస్థానం తరుపున దీక్షా వస్త్రాలు, మాలలు వసతి, భోజనం దేవస్థానం ఉచితంగా ఏర్పాటుచేస్తుందని తెలిపారు. మహిళాదీక్షదారులకు ఏకాదశి దినదీక్ష 11 రోజులకు దీక్ష చేపట్టవచ్చునని ఈనెల 14న ఈ దీక్ష ప్రా రంభమవుతుందన్నారు. ప్రతిఏటా మాదిరిగానే గోవిందమాలదీక్షాదారణ దేవస్థానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే పర్యాటకం అభివృద్ధి

పర్యాటక మంత్రి కందుల దుర్గేష్


భీమేశ్వరాలయం వద్ద నిర్మాణంలో ఉన్న డార్మెటరీని పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే చినరాజప్ప, తుమ్మల బాబు

సామర్లకోట, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్వీర్యం అయిన పర్యాటకం అభివృద్ధి చేసేందుకు తిరిగి పూర్వవైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు కృషిచేస్తున్నారని రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొ న్నారు. శనివారం సామర్లకోటలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. అనంతరం స్థానిక కుమారరామ భీమేశ్వరాలయం వద్ద నిర్మాణంలో ఉన్న పలు భవనాలను, భక్తులు వినియోగించే డార్మెటరీ భవనాన్ని మంత్రి పరిశీలించారు. ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ టూరిజం పాలసీ నూతనంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు ప్రభుత్వం ఇ స్తున్న రాయితీలవలె పర్యాటక రంగానికి సైతం ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి దుర్గేష్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణా రాష్ట్రం తరహాలో సినీపరిశ్రమ అభివృద్ధి చెందేందుకు గల సాధ్యా సాధ్యాలపై ప్రభుత్వం అధ్యయనం చేస్తుందన్నారు. దీని కోసం త్రిసభ్య కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదించారని మంత్రి దుర్గేష్ చెప్పారు. ఎమ్మెల్యే చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


డబ్బుల బ్యాగ్‌ను తిరిగి అప్పగిస్తున్న దృశ్యం

పోలీస్ కానిస్టేబుల్ నిజాయితీ

- పొరపాటున దుస్తుల బ్యాగ్‌తోపాటు రూ.8లక్షల బ్యాగ్ ఇచ్చేసిన వస్త్రదుకాణం యజమాని
- కాసేపటికి గ్రహించి జగ్గంపేట పోలీసులకు సమాచారం
- డబ్బుల బ్యాగ్ తిరిగి అప్పగించిన కాకినాడ ఏపీఎస్పీ పోలీస్ కానిస్టేబుల్

జగ్గంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో ఓ పోలీస్ కానిస్టేబుల్ నిజాయితీ కనబర్చాడు. స్థానిక మెయిన్‌రోడ్‌లోని ఓ వస్త్ర దుకాణంలో శనివారం మధ్యాహ్నం కాకినాడ మూడో ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ తోట సూరిబాబు దుస్తులు కొనుగోలు చేశాడు. ఆ షాపు యజమాని అతడి దుస్తుల కవర్లతోపాటు పొరపాటున షాప్‌కు చెందిన రూ.8లక్షలు ఉన్న కవరును కూడా ఆ పోలీస్ కానిస్టేబుల్‌కు ఇచ్చేశాడు. కాసేపటికి విషయాన్ని గ్రహించిన షాపు యజమాని వెంటనే కంగారుపడి స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన సీఐ శ్రీనివాస్ పొరపాటున డబ్బులు బ్యాగ్ తీసుకువెళ్లిన పోలీస్ కానిస్టేబుల్ తోట సూరిబాబును గుర్తించారు. అతడికి సమాచారం అందించి ఆ సొమ్ము తిరిగి తీసుకురావాల్సిందిగా కోరారు. వెంటనే కానిస్టేబుల్ తోట సూరిబాబు తన వద్దఉన్న రూ.8లక్షల బ్యాగ్‌ను గుర్తించి జగ్గంపేట పోలీ సులకు అందజేశారు. నిజాయితీగా నగదును తిరిగి అప్పగించిన సూరిబాబును జగ్గంపేట సీఐ శ్రీనివాస్ అభినందించారు.

నేడు రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సమావేశం

పిఠాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా రగ్బీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు కాకినాడజిల్లా పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో జరుగుతుందని సంఘం అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ తెలిపారు. సంఘ సభ్యులందరూ ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి

దివ్యాంగురాలి మృతి

- పెన్షన్ తీసుకునేందుకు వెళ్తుండగా ఘటన


బస్సు నుంచి జారిపడి మృతిచెందిన నడవపల్లి భద్రం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలం అంగరలో శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి దివ్యాంగురా లు నడవపల్లి భద్రం(54) మృతి చెందింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.... బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం ఎండగండి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ అయిన నడవపల్లి భద్రం అంగరలోని తన అక్క పావులూరి వీరవేణి ఇంటి వద్ద ఉం టుంది. శనివారం ఉదయం అంగర నుంచి ఎండగండిలో పెన్షన్ తీసుకునేందుకు అంగర గాంధీ సెంటర్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా జారిపడి బస్సు వెనుక చక్రంలో పడి మృతి చెందింది. వికలాంగురాలైన ఆమెకు ఒక కుమారుడు ఉండగా అతడు కాజులూరులో ఉంటున్నాడు. అంగర గ్రామంలో అక్క ఇంటివద్ద ఉంటూ పించన్‌తోనే ఆమె జీవనం కొనసాగిస్తుంది. దీనిపై మండపేట రూరల్ ఎస్‌ఐ బుచ్చిబాబు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ బుచ్చిబాబు తెలిపారు.

భద్రమ్మ కుటుంబానికి అండగా ఉంటాం: జేసీ

కె.గంగవరం: పింఛన్ తీసుకోవడానికి బస్సు ఎక్కుతూ ప్రమాదానికిగురై ప్రాణాలు విడిచిన నడవపల్లి భద్రం కుటుంబానికి అండగా ఉంటామని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. భద్రం శనివారం కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో ప్రమాదానికిగురై చనిపోయింది. అక్కడి నుంచి పోస్టుమార్టం పూర్తి చేసుకుని స్వగ్రామం యండగండి తరలించారు. యండగండిలో అంత్యక్రియలు పూర్తి చేశారు. భద్రం కుమారుడు దుర్గాప్ర సాద్‌ను ఇతర కుటుంబ సభ్యులను జేసీ శనివారంరాత్రి యండగండిలో పరామర్శించారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆమె వెంట రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఆర్.ఐ.వెంకట్రావు, వీఆర్వో బాబి, సర్పంచ్ చోడే గోవిందరాజు ఉన్నారు.


యండగండిలో భద్రం కుమార్తును పరామర్శిస్తున్న జేసీ నిషాంతి

వెంకటాపురం ఇంగ్లీష్ టీచర్ సస్పెన్షన్

రంగంపేట, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వెంకటాపురం ఎంపీపీ స్కూల్లో పనిచేస్తున్న ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు డీ.సుశీల బాధ్యతరాహిత్యంగా వ్యవహరించిన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఏపీ సివిల్ సర్వీసెస్ కాండక్ట్ రూల్స్ 1964కి లోబడి సస్పెన్షన్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులతో కారు శుభ్రపరచడం, ఇతర వ్యక్తిగత పనులు చేయించడంపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన తర్వాత వాస్తవాలను నిర్ధారించిన తర్వాత సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కోరుకొండ ఆలయ దత్తత నుంచి

అన్నవరం ఆలయానికి విముక్తి కలిగించాలని లేఖ

అన్నవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం దత్తత ఆలయమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అన్నవరం దేవస్థానం దత్తత నుంచి మినహాయించాలని దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దేవదాయ కమిషనర్‌కు లేఖ ద్వారా తెలియపరిచారు. ఆలయంలో పరిపాలనపరమైన ఇబ్బందుల దృష్ట్యా సిబ్బంది అన్నవరం దేవస్థానం నుంచి పంపించడం వ్యయప్రయాసలతో కూడుకోవడం తరచూ ఏదో వివాదం చుట్టుముట్టుతుండడంతో దేవస్థానం అధికారులు ఈనిర్ణయం తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కోరుకొండ ఆలయాన్ని అన్నవరం దేవస్థానానికి దత్తతగా ఇవ్వడంతో అప్పటినుంచి పాలనాపరమైన వ్యవహారాలు అన్నవరం దేవస్థానమే చూసుకుంటూవచ్చింది. అక్కడ ఉత్సవాల నిర్వహణ, భూముల పరిరక్షణ క్లిష్టపరమైన బాధ్యతలు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏటా సుమారు రూ.30 లక్షల వరకు అన్నవరం దేవస్థానం వ్యయం చేయాల్సి వస్తోంది.

సామర్లకోటలో తాడేపల్లిగూడెం 'నిట్' బృందం పర్యటన

- తాగునీటి సరఫరాను పరిశీలించిన బృందం

సామర్లకోట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీ పట్టణ ప్రజలకు రోజూవారీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరాను శనివారం తాడేపల్లిగూడెంనకు చెందిన నిట్ జాతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ల బృందం నలుగురు సభ్యులు సామర్లకోటకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణ తాగునీటి సరఫరాపై ప్రజ ల నుంచే గాకుండా కౌన్సిలర్ల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నందున ప్రభుత్వ ఆదేశాల మేరకు నిట్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఫిల్టర్ వాటర్ స్కీంవద్ద నీటి పరిశుభ్రత, క్లోరిన్, ఆలమ్‌ల కలయిక, క్లోరినేషన్ చర్యలు, నీటి పంపింగ్ అంశాలు పరిశీ లించారు. గోదావరి జలాలు నిల్వలుచేసే వేసవి జలాశ యంలో నీటి నిల్వలు పరిశుభ్రంగా ఉన్నాయా, దుర్గంధం వెదజల్లుతున్నాయా అనే అంశాలు పరిశీలించారు. గోదావరి కాలువ నుంచి జలాశయంనకు వెళ్లే ఇన్‌లెట్, జలాశయం నుంచి ఫిల్టర్‌ప్లాంట్‌కు వెళ్లే ఇన్‌లెట్‌లను పరిశీలిం చారు. అనంతరం గోదావరి కాలువ నుంచి జలాశ యంలోకి వెళ్లే ఇన్‌లెట్ మార్గాలను సైతం పరిశీలి ంచారు. శుద్ధిచేసిన నీటిని ట్యాంకులకు పంపింగ్ వంటి అంశాలతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంకుల నుం చి కుళాయిలకు సరఫరా వంటి అంశాలను పరి శీలించారు. ఆయా ప్రాంతాల నుంచి సుమారు 9 బాటిళ్లతో నీటి నమూనాలు సేకరించి విశ్లేషణ నిమిత్తం బృందం తమ వెంట తాడేపల్లిగూడెం తీసుకువెళ్లారు. ప్రొఫెసర్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతూ జలాశయం నుంచి రాబార్ ద్వారా శుద్ధిచేసే విధానాన్ని మరింత పెంచా ల్సి ఉందన్నారు. శుద్ధిచేసిన నీటిలో పీపీఎం శాతాన్ని పరీక్షించిన తర్వాతే ట్యాంకులకు పంపింగ్ చేయాల న్నారు. ప్రస్తుతం ఫిల్టర్ వాటర్ నిర్మించి 20 ఏళ్లు పైబడినందున పనితీరు సామర్థ్యం పరీక్షించాల్సి ఉందన్నారు. నూతనంగా ఏర్పాటుచేయాలా, ఇదే మరమ్మతులు చేపట్టాలా అనే అం శాలపై ల్యాబ్‌లో విశ్లేషణల అనంతరం నివేదికలు ప్రభు త్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ బృందంలో నిట్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ భరణి, డాక్టర్ రేష్మా, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సుభానిలు ఉన్నారు. వీరి వెంట సామర్లకోట మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ శ్రీనివాస్, ఎమి నిటీ కార్యదర్శి ఉండూరు శ్రీనివాస్, సూపర్‌వైజరు శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.


సామర్లకోటలో తాగునీటి సరఫరాపై నిట్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు పరిశీలిస్తున్న దృశ్యం

బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరి మృతి

- జాతీయ రహదారిపై భీమవరం వద్ద ఘటన


మృతులు కురసం భద్రయ్య, పొడియం రాజారావు (ఫైల్)


ఘటనలో మృతి చెందిన భద్రయ్య, రాజారావు

ఎటపాక, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎదురు గా వస్తున్న బైక్‌ను ఐరన్ లోడ్ లారీ రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు ఆది వాసీలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన శుక్రవారం అర్ధరాత్రి విజ యవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై అల్లూరి జిల్లా ఎటపాక మండలం చోడవరం పంచాయతీలోని భీమవరం గ్రామంవద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీపురం పంచా యతీలోని కన్నాపురం గ్రామానికి చెందిన కురసం భద్రయ్య, (41), పొడియం రాజారావు(31) ఇద్దరు కలిసి బైక్‌పై భద్రాచలం వెళ్లి తిరిగి రాత్రి సమయంలో ఇంటికి వస్తున్నారు. ఈక్ర మంలో చింతూరువైపు నుంచి భద్రా చలం వస్తున్న ఐరన్‌లోడ్ లారీ భీమవరం వద్దకు రాగానే రాంగ్‌రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో భద్రయ్య, రాజారావులకు తీవ్ర గాయాలతో అక్కడికక్క డే దుర్మరణం చెందారు. స్థానికులు 108 కు సమాచారంతో ఇవ్వడంతో ఇరువురిని భద్రాచ లం ఏరియా ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఘటన జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు. ఇరు వురిది వ్యవసాయ కూలీ కుటుంబ నేపథ్యం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాల కు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యు లకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

- ఒకరు మృతి, నలుగురికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో మరణించిన సోమరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామం ఆటోనగర్ జంక్షన్‌వద్ద ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో 80 ఏళ్ల వృద్ధుడు మృతి చెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన సోమరాజు అతడి తమ్ముడి కుటుంబ సభ్యులు కలిసి బెండపూడి బంధువుల ఇంటికి ఆటోలో వెళ్లారు. తిరిగి దివాన్‌చెరువు మీదుగా రాజమహేంద్రవరం వస్తుండగా ఆటోనగర్ సెంటర్‌లో ఓ లారీ ఆటోనగర్ లోంచి బయటకు వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బోడపాటిసోమరాజు (80) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న దొమ్మేటి అర్జునరావు, అచ్చియ్యమ్మ, మల్లిబాబులకు తీవ్రగాయాలయ్యాయి. సత్యనారాయణ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బొమ్మూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి సోమరాజు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తుచేస్తున్నారు.

వివాహిత హత్య కేసులో భర్తే కాలయముడు

- నిందితుడిని అరెస్టుచేసిన పోలీసులు


నిందితుడిని అరెస్ట్ చేసిన కొత్తపల్లి పోలీసులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద మృతి కేసులో భర్తను శనివారం అరెస్ట్ చేసినట్లు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ చెప్పారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. మూలపేటకు చెందిన రాచపల్లి ప్రసాద్ అదే గ్రామానికి చెందిన గింజాల బాలను 9 సంవత్సరాలక్రితం ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నాడు. జనవరి 18న బాల అర్ధరాత్రి సమయంలో మృతి చెందడంతో భర్త ఎవరికీ చెప్పకుండా శ్మశానంలో పూడ్చిపెట్టడంతో మృతురాలి తల్లి గింజాల లక్ష్మికి అనుమానం వచ్చింది. దీంతో ప్రసాద్‌కు వేరే అమ్మాయితో అక్రమ సంబంధం ఉందని, తన కుమార్తెను అడ్డుతొలగించుకునేందుకు ప్రసాదే హత్య చేశాడని ఆమె కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేష్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం పూడ్చిపెట్టిన మృతురాలి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా బాలను మెడకు చున్నీతో బిగించి ఊపిరి ఆడకుండా చేసినట్టు రిపోర్టు రావడంతో అనుమానాస్పద మృతి కేసును హత్యకేసుగా నమోదుచేసి నిందితుడిని ఆచూకీ కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో నిందితుడు ప్రసాద్ మూలపేట వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయి తానే తన భార్యను హత్య చేశానని ఒప్పుకున్నాడని తెలిపారు. బాలకు వాంతులు వీరోచనాలతో మృతి చెందిందని తల్లికి తప్పుడు సమాచారం ఇచ్చానని అంగీకరించాడని సీఐ శ్రీనివాస్ చెప్పారు. ఈ కేసులో నిందితుడు ప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్‌కు పంపించినట్టు తెలిపారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పక్కింటికి ఎదురింటికి వెళ్ళవద్దని ఇంట్లోనే ఉండాలని తల్లి మందలించిందని ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం శేషయ్యమెట్టకు చెందిన దాసరి తులసీ, శ్రీనివాస్ దంపతులకు నాగసాయి దుర్గ(12), ఓ బాలుడు సంతానం. 2021లో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాస్ మృతి చెందాడు. దాంతో తులసీ అదే ఏడాది బోగిన నాగేశ్వరావు అనే డ్రైవర్‌ను రెండో పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి తల్లితో సాయిదుర్గ ఇష్టంగా ఉండడం లేదు. ఎక్కువ శాతం ఇరుగింటి వద్ద పొరుగింటి వద్ద ఉంటోంది. స్థానికంగా ఓ స్కూల్లో 7వ తరగతి చదువుతోంది. తులిసి మెయిన్ రోడ్డులోని ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. ఉదయం పనికి వెళ్లి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి పిల్లలకు భోజనం తయారు చేసి తిరిగి పనిలోకి వెళ్లిపోతుంది. ఈ క్రమంలో శుక్రవారం దుర్గ స్కూల్‌కు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండడంతో మందలించి వెళ్లింది. సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చి అన్నం వండి ఎదురింటి వద్ద ఉన్న దుర్గను పిలిచి మందలించింది. దీంతో ఇద్దరు గొడవ పడ్డారు. ఆపై ఇంట్లో ఉండాలనిచెప్పి తల్లి వెళ్లిపోయింది. తల్లితో గొడవ పడిన దుర్గ తల్లి వెళ్ళిపోయాక ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుంది. రాత్రి తల్లి వచ్చి చూసే సరికి ఫ్యానుకు వేళాడుతు కనిపించింది. స్థానికుల సహకారంతో దుర్గను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీ తరలించారు.

పోలీసు లాంఛనాలతో ఎస్‌ఐకు అంత్యక్రియలు

- నివాళులర్పించిన అడిషనల్ ఎస్పీ ప్రసాద్
- అంత్యక్రియలకు హాజరైన సహచర ఎస్‌ఐలు, సిబ్బంది
- గంగవరంలో విషాద ఛాయలు


ఎస్‌ఐ మూర్తి పార్థీవదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు, కోటిపల్లి శ్మశానవాటిక వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసులు

కె.గంగవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తణుకులో చనిపోయిన ఎస్‌ఐ ఆదుర్తి జీ.ఎస్.మూర్తి పార్థీవదేహాన్ని పోస్టుమార్టం అనంత రం శుక్రవారం రాత్రి ఆయన స్వగ్రామం కె.గంగవరం తీసుకువచ్చారు. శనివారం ఉదయం నుంచి గ్రామస్తులు, సహచర పోలీసు సిబ్బంది, బంధువులు సందర్శించి నివాళులర్పించారు. మూర్తి భౌతికకాయాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారు సానుభూతి తెలిపారు. మూర్తి పనిచేసిన పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చిన పోలీసులు ఆయన బ్యాచ్‌కు చెందిన సహచర ఎస్‌ఐలు మూర్తి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుమ్మరి శాలివాహన సంఘం అధికారప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, ప్రచార కార్యదర్శి రాలి శ్రీనివాసవడయార్, కె.గంగవరం నాయకులు ఏడిద నాగరాజు, తదితరులు పార్థీవదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కోటిపల్లి గోదావరి ఒడ్డున స్మశానవాటికకు తరలించారు. అక్కడ రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, పామర్రు ఎస్‌ఐ ఎస్‌కె జానీబాషా ఆధ్వర్యంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు.

ఎస్‌ఐ మూర్తి కుటుంబాన్ని ఆదుకుంటాం: మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ): నిరుపేద కుటుంబం నుంచి పోలీసుశాఖలో ఎస్‌ఐ స్థాయి అధికారిగా ఎదిగిన ఏజీఎస్ మూర్తి అకాల మరణం బాధాకరమని మంత్రి సుభాష్ ఆవేదన వ్యక్తం చేశారు. తణుకులో ఎస్‌ఐ మూర్తి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎస్‌ఐ మూర్తి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామన్నారు. కె.గంగవరానికి చెందిన ఆదుర్తి గంగ సత్యనారాయణమూర్తి కష్టపడి చదువుకుని ఎస్‌ఐగా ఉద్యోగం సంపాదించారని అన్నారు. ఆయన మరణవార్త కలచివేసిందన్నారు. ఎస్‌ఐ మూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


ఎస్‌ఐ మూర్తి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి'

పెద్దాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు సహకరించాలని తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు.

గొల్లప్రోలు టీపీవోగా నీలిమాదీప్తి



నీలిమాదీప్తికి బొకే అందజేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ టౌన్‌ప్లానింగ్ అధికారి(టీపీవో)గా జేఎన్‌సీహెచ్ నీలిమాదీప్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కొవ్వూరు మున్సిపాలిటీ టీపీఎస్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ నగరపంచాయతీలో టీపీవో, టీపీఎస్, టీపీబీవో పోస్టులన్నీ ఖాళీగా ఉండగా, ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. ఇప్పుడు రెగ్యులర్ టీపీవో నియమాకంతో ఒక పోస్టు భర్తీ అయింది. టీపీవోను సిబ్బంది, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రీడా మైదానంలో సమావేశ వేదిక, వంటగది ప్రారంభం



జిల్లా క్రీడామైదానంలో సమావేశ వేదిక, వంటగదిని ప్రారంభిస్తున్న అతిథులు

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో తలాటం హరీష్ చారిటబుల్ ట్రస్ట్ అందించిన రూ.5లక్షలతో నిర్మించిన సమావేశ వేదిక, వంటగదిని శనివారం క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి, బాపిరాజు, కొండుకూరి రంగమణి, కోటయ్య స్వీట్స్ అధినేత రామ్‌కుమార్ ప్రారంభించారు. తలాటం హరీష్ సామాజిక సేవలను కొనియాడారు. పంపన సాయి, పిడక శేషు, క్రీడాకారులు చార్లె, సతీష్, శేఖర్, కృష్ణవేణి, రాజు పాల్గొన్నారు.

'అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్ గాంధీ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముపై చేసిన అనుచిత వ్యాఖ్యలు చేసిన వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ డైరెక్టర్ వాసంశెట్టిశ్రీనివాసరావు శనివారం డిమాండ్ చేశారు.

'తాళ్లరేవు మండలంలో సమస్యలను పరిష్కరించాలి'

తాళ్లరేవు/యానాం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు పంచాయితీ తూర్పుపేట గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గ్రామ మహిళలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామంలో మంచినీరు సమృద్ధిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సీసీ డ్రెయిన్ కూడా లేదని మహిళలు వాపోయారు. సమస్యలపై వ్యవసాయ కార్మికసంఘం తరుపున పోరాడతామని ఆయన తెలిపారు.

బడ్జెట్ బాగుంది!

కేంద్రప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలోని పలు పార్టీల నాయకులు స్పందించారు. బడ్జెట్ బాగుందని, అన్ని వర్గాలకు ఆర్థిక ఊతమిచ్చేలా ఉందని వారు అభిప్రాయపడ్డారు.

పేద, మధ్య తరగతికి పెద్ద పీట



కాకినాడ సిటీ: కేంద్ర బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. ఏపీకి ప్రాధాన్యత ఇవ్వడం సంతోష కరం. అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన డ్రీమ్ బడ్జెట్. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేలా ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రం ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కేంద్రం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం నిధులు రాబట్టినందుకు అభినందనలు.

జిల్లా టీడీపీ అధ్యక్షుడు, జ్యోతుల నవీన్

అన్ని వర్గాలకు ఆర్థిక ఊతం



కార్పొరేషన్: భారతదేశాన్ని మరింత అభి వృద్ధి పథంలో నడిపేలా, దేశంలో అన్ని వర్గాలకు ఆర్థిక ఊతమిచ్చేలా మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉంది. కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంపు 3 నుంచి 5 లక్షలకు పెంచడం ద్వారా 7.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చేలా ఎంఎస్ఎంఈలకు 1.5లక్షల కోట్లు కేటాయించడం గొప్ప విషయం. తద్వారా మేకిన్ ఇండియా బ్రాండ్‌తో తయారీ రంగానికి ప్రత్యేక ప్రోత్సాహం ఇవ్వడమే. పోలవరం ఎత్తు పెంచడానికి నిధులు ఇచ్చేందుకు అంగీకరించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తుంది.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు, బిక్కిన విశ్వేశ్వరరావు

ప్రజారంజక బడ్జెట్

సర్పవరం జంక్షన్: ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజక బడ్జెట్‌గా ఉంది. రూ.12 లక్షలవరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడంతో ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట. ఎగుమతులకు సంబంధించి ఉత్పత్తులు సుమారు 40 శాతం స్మాల్ అండ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ నుంచే వస్తున్నాయి. బడ్జెట్‌లో వీటికి అధిక ప్రాధాన్యత, రాయితీలు ఇవ్వడంతో వృద్ధి రేటు మరింత పెరిగే అవకాశం ఉంది. తద్వారా గ్రామీణయువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయి.

చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు

కేంద్రానికి కృతజ్ఞతలు



కలెక్టరేట్: కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపు 12లక్షల 75వేల వరకు ఇవ్వడం ఉద్యోగులకు ఊరట ఇచ్చింది. సుదీర్ఘకాలంగా ఈ సవరణ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఎంతో ఉపకరిస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షన్స్ దారులు 63వేల మంది ఉండగా దీనిలో దాదాపు 20వేల మంది ఉద్యోగులకు ఈ ఆదాయ పన్ను మినహాయింపు ఉపకరిస్తుంది. కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

జేఏసీ అమరావతి, జిల్లా శాఖ చైర్మన్ త్రినాథ్

వృద్ధి రేటు పెరుగుదల



పిఠాపురం రూరల్: ఆదాయం రూ.12లక్షల వరకూ ఎటువంటి పన్నులు చెల్లించకుండా మి నహాయింపులు ఇవ్వడం మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులకు ఎంతో ఊరట కలిగిస్తుంది. గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాలకు, ఉ త్పత్తి, ఉపాధి కల్పనకు, విద్యా వైద్య రంగాలకు కేంద్ర బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు వృద్ధి రేటును మరింత పెంచగలవు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గండి కొండలరావు

కేటాయింపులు హర్షణీయం

కాకినాడ రూరల్: కేంద్రబడ్జెట్‌లో విద్యా, వైద్యఆరోగ్య రంగాలకు నిధులు కేటాయింపులు పెంచడం హర్షణీయం. రెవెన్యూ వ్యయంలో అధిక బాగం అప్పుల వడ్డీ చెల్లింపులకు సరిపోతుంది. ఆదాయపు పన్ను శ్లాబు పరిమితిని పెంచుతున్నట్లు రూ.12లక్షల వరకూ పన్ను ఉండదన్నారు ఇది తాత్కాలికమే.

కె.హరికిషన్, పీఆర్ కళాశాల ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు

పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలి

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



చేబ్రోలులో ప్రచారం నిర్వహిస్తున్న వర్మ

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్‌ను రికార్డుస్థాయి మెజార్టీతో గెలిపించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. పిఠాపురం నియోజకవర్గంలో గొల్లప్రోలు మండలం చేబ్రోలు నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. పట్టబద్రుల ఓటర్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, ఓరుగంటి వీరబాబు, నాగేంద్ర,ఆనంద్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దు : సీఐ



సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మత్తు మదార్థాలు, మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్లవద్దని, దీని వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారమవుతుందని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. క్రమశిక్షణతో ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని, అదే గాడి తప్పితే చిన్నాభిన్నమవుతుందని తెలిపారు. ఈవ్‌టీజింగ్ పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహచర విద్యార్థినులను సోదరభావంతో చూడాలని సూచించారు. వారిని ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరంగా కేసులు నమోదు చేయడంతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడమని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో పట్టణ ఎస్ఐ మణికుమార్, అడిషనల్ ఎస్ఐ జానీభాషా ఉన్నారు.

'విద్యకు ప్రాధాన్యం'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యకు తమ విద్యాసంస్థల ద్వారా ప్రాధాన్యతమిచ్చామని ఎంఎస్ఎన్ విద్యాసంస్థల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. నెప్రూా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాల 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం అశోక్‌నగర్‌లోని కళాశాల ప్రాంగణంలో విలేకర్ల సమావేశంనిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం లక్ష్మీ తులసి మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక వివేకానంద పార్కు ఆవ రణలోని రాగిరెడ్డి కళాక్షేత్రంలో రజతోత్సవ వేడు కలు జరుగనున్నాయని తెలిపారు. శ్రీవిజయ్ మాట్లాడుతూ ఈ వేడుకల్లో భాగంగా 11 నుంచి 20 ఏళ్ల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ ప్రమోద్ మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనేందుకు వందమంది పైగా విద్యార్థులు, తల్లిదండ్రులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు.

'వెల్ఫేర్' సభ్యత్వాలను రెన్యువల్ చేయించుకోండి

కార్మికశాఖ సహాయ కమిషనరు బుల్లిరాణి



పిఠాపురంలో భవన నిర్మాణ కార్మిక సంఘాలతో జరిగిన సమావేశంలో పాల్గొన్న బుల్లిరాణి

పిఠాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ బోర్డులో సభ్యులుగా ఉన్న కార్మికులు తమ సభ్యత్వాలను రెన్యువల్ చేయించుకుని తప్పనిసరిగా గుర్తింపుకార్డులు తీసుకోవాలని కార్మికశాఖ సహాయ కమిషనరు బుల్లిరాణి సూచించారు. పిఠాపురంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులు, సభ్యులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలోనే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు కానున్నాయని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నదని చెప్పారు. బోర్డును పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిమ్‌లను తక్షణం విడుదల చేయాలని, పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. వివిధ సంఘాల ప్రతినిధులు కుంచే చిన్నా, పి.చిరంజీవి, కొయ్యల రమణ, ఎం.సత్తిబాబు, సాంబశివ, సత్యనారాయణ, రామన్నరాజు, శివ, నాగేశ్వరరావు, శ్రీను, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్



పనులపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరంలో రామకృష్ణారావుపేట తదితర ప్రాంతాల్లో శనివారం కమిషనర్ భావన పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ ఎలా జరుగుతుందనే విషయాన్ని పరిశీలించారు. చెత్త సేకరణ, తరలింపు, ఎవాహణాల పనితీరును గమనించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. కెన్నల్స్ కనస్ట్రక్షన్సను పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. పర్యటనలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకంలో తేడాపై కేసు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాశాఖ ఆధ్వర్యంలో నిరుపేదలకు పంపిణీ చేస్తున్న బియ్యం తూకంలో తేడా రావడంతో కేసు రాసినట్టు తూనికలు-కొలతలశాఖ కాకినాడ ఇన్‌స్పెక్టర్ పి.సరోజిని తెలిపారు. శనివారం సర్పవరం గాంధీనగర్‌లో ఎండీయూ ఆపరేటర్ వనం మురళీ రేషన్‌కార్డు లబ్ధిదారులకు బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నారు. రేషన్ బియ్యం బరువు తూకం తూయడంలో 5 కిలోల బియ్యం బరువుకి అర కిలో బియ్యం తక్కువ తూకం వేయడం పట్ల లబ్ధిదారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో ఎండీయూ ఆపరేటర్, లబ్ధిదారుల మధ్య వాగ్వాదం జరిగింది. తూకంలో మోసం పట్ల స్థానికులు తూనికలు, కొలతలశాఖ అధికారులు, ఎంఎస్‌వోలకు ఫిర్యాదు మేరకు కాకినాడ తూనికలు-కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పి.సరోజిని క్షేత్రస్థాయికి వెళ్లి బియ్యం తూకాలను పరీక్షించారు. 5 కిలోల బియ్యం తూకానికి అరకిలో తరుగు (తక్కువ) తూకం వేస్తున్నట్టు గుర్తించి సదరు ఎండీయూ ఆపరేటర్‌పై కేసురాసినట్టు చెప్పారు.

శృంగారవల్లభస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి దర్శనానికి శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,69,840 అన్నదాన విరాళాలు రూ.81,119 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.6,720, తులాభారం, కానుకల ద్వారా రూ.500, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.31,230 వెరసి రూ. 3,89,409 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు పులిహోర, అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్టు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు ఉన్నారు.



స్వామివారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

జడ్పీ సీఈవో లక్ష్మణరావు



మల్లవరంలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు సూచించారు. గొల్లప్రోలు మండలం మల్లవరంలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన శనివారం సాయంత్రం పరిశీలించారు. తాగునీటి పథకం పనితీరు, గ్రామాలకు నీటి సరఫరా తదితర అంశాలపై ఆరా తీశారు.గొల్లప్రోలు ఎంపీడీవో కర్రి స్వప్న ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెండ్

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంతో పాటూ ఉన్నతాధికారుల ఫోన్లకు స్పందించకుండా బాధ్యతారాహిత్యానికి పాల్పడిన తిమ్మాపురం పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్లు కలెక్టర్ ఎస్.యశ్వంత్ కుమార్‌ని సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 62 పింఛన్లకు 41 లబ్ధిదారులకు పంపిణీ చేసిన యశ్వంత్ కుమార్ మిగిలిన పింఛన్లు పంపిణీ చేయకపోగా, ఉన్నతాధికారుల ఫోన్లకు స్పందించకుండా వ్యవహరించినందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్రమశిక్షణా రహిత్యానికి పాల్పడినందుకు అతడిని సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

24 నుంచి ఏఐసీసీటీయూ మహాసభలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి 26వరకు ఢిల్లీలో జరిగే ఆల్‌ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (ఏఐసీసీటీయూ)11వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కొత్తపల్లిలో కార్మికులు కరపత్రాలను పంపిణీ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఊరచెరువు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకు సాగింది. మోదీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తూ భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిని తీవ్రతరం చేస్తుందని ఏసీసీటీయూ రాష్ట్ర నాయకుడు గొడుగు సత్యనారాయణ ఆరోపించారు. సీపీఎం లిబరేషన్ సభ్యులు శీలం అప్పలరాజు, లోవకుమారి, బొందు రాజేష్, ఏఐసీసీటీయూ నాయకులు శ్రీను, నవీన్, మహిళా సంఘ సభ్యులు రాఘవ, వినోద్ ఉన్నారు.

బేకరీలో తనిఖీలు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి: కాలం చెల్లిన ఆహార పదార్థాల ఉత్పత్తులు విక్రయిస్తున్నాన్న ఫిర్యాదుపై శనివారం వలసపాకల గంగరాజునగర్ రోడ్డు నెంబర్ 4 లో ఉన్న ఓ బేకరీపై ఆహార తనిఖీ అధికారి సుబ్బారావు తనిఖీలు చేపట్టారు. బేకరీలో తయారువుతున్న రస్కులు, కేకులు, రొట్టెలు, బిస్కెట్లు తదితర ఆహార ఉత్పత్తులు పరిశీలించారు. బేకరి నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి అనుమతి, లైసెన్స్ లేదని గుర్తించారు. పలు శాంపుల్స్ సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపించారు. లైసెన్స్ లేకుండా అమ్మకాలు సాగిస్తున్న నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు అధికారి సుబ్బారావు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి మన్నే నాగేశ్వరరావు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. శనివారం స్థానిక జగన్నాధపురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆయనకు టీడీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గుత్తుల రమణ, పి లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే

'స్థలాల గుర్తింపునకు సమగ్ర సర్వే నిర్వహించాలి'

పిఠాపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): పిఠాపురం శివారులోని మహారాజ వారధికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించాలని పిఠాపురం మహారాజా వారధి పరిరక్షణ సమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమితి ప్రతినిధి యనమండ్ర సూర్యనారాయణ శనివారం కాకినాడ ఆర్డీవో మల్లిబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వారధికి ఇరువైపులా అప్రోచ్, కనెక్టవిటీ రోడ్లు నిర్మిస్తామని గతంలో ఎన్‌హెచ్ అధికారులు తెలిపారని చెప్పారు. ఆక్రమణలను గుర్తించేందుకు సర్వే నిర్వహించాలని జాతీయరహదారి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్ చెప్పారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ, ఎన్‌హెచ్‌కు చెందిన స్థలాలను గుర్తించి సర్వే చేపట్టాలన్నారు.

'స్పాన్సర్ పేరుతో మోసాలు'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కొంత మంది సైబర్ నేరగాళ్లు స్పాన్సర్ పేరుతో ఫోన్ కాల్స్ చేసి విద్యార్థులను మోసగిస్తున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అక్కూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి కోరారు. శనివారం తిమ్మాపురం అక్కూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ఎంబీఏ విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తామని, సంబంధిత ఫ్యాకల్టీలకు కాల్ చేసి పేద విద్యార్థుల వివరాలు తీసుకుంటున్నారన్నారు. ఎన్‌జీవోలు, ప్రముఖుల మద్దతు ఉందని, వారి సాయంతో నిరుపేద విద్యార్థులకు స్పాన్సర్స్ చేస్తామని విద్యార్థుల వివరాలు తీసుకుంటున్నట్టు తెలిసిందన్నారు. మోసగాళ్లు చెప్పే మాటలను నమ్మి విద్యార్థుల వివరాలను ఎవరికీ ఇవ్వవద్దని అధ్యాపకులను కోరారు. అనుమానాస్పద కాల్ వస్తే అధ్యాపకులు, హెచ్‌వోడీలను సంప్రదించాలని కోరారు. అత్యవసర సమయంలో సైబర్ క్రైం 1930 ను సంప్రదించాలని ఆమె సూచించారు.

కల్తీ డీజిల్ సరఫరాపై ఆందోళన

కొత్తపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కల్తీ డీజిల్ సరఫరా చేయడం వల్ల బోట్లు ఇంజన్‌లు చెడిపోతున్నాయని అమీనబాద్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద మత్స్యకారులు శనివారం రాత్రి ఆందోళన చేపట్టారు. తెల్లవారుజామున 3-4 గంటల సమయంలో సముద్రంపై వేటకు వెళ్లేందుకు పెట్రోల్ బంక్‌లో రెండు కేన్‌ల్లో డీజిల్ పోయించుకున్నామని మత్స్యకారుడు ఉమ్మిడి సత్తిబాబు తెలిపారు. స్థానిక హార్బర్ ప్రాంతంలో ఉన్న బోట్లకు డీజిల్ నింపి వేటకు బయలుదేరామని, సముద్రంలో కొంతదూరం వెళ్లే సరికి బోట్ల ఇంజన్‌లు మొరాయించడంతో కేన్‌లో ఉన్న డీజిల్‌ను పరిశీలించామని, చాలా నల్లగా మాడినట్టు ఉండడంతో బంక్ వద్దకు ఆరా తీశామన్నారు. డీజిల్ పోయడం వరకే తమ పని అని, అక్కడ పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అమీనబాద్‌కు చెందిన మత్స్యకారులు బంక్ వద్ద ఆందోళన చేపట్టారు. కల్తీ డీజిల్ సరఫరా చేయడమే కాకుండా ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్న బంక్ యాజమాన్యం, సిబ్బందిపై చర్యలు చేపట్టాలని మత్స్యకారులు డిమాండ్ చేశారు. దీనిపై మత్స్యకారులు బంక్ యాజమాన్యంపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంక్ యాజమాన్యం, మత్స్యకార పెద్దలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో మత్స్యకారులు తాత్కా లికంగా ఆందోళన విరమించారు.



అమీనబాద్‌లో బంక్ వద్ద మత్స్యకారులు

'చిత్తడి నేలలను పరిరక్షించాలి'

తాళ్లరేవు/యానాం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చిత్తడి నేలలను పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్, అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల సంరక్షణ అవగాహన సదస్సును కోరంగి అభయారణ్యంలో శనివారం నిర్వహించారు. నాలుగు పాఠశాలల నుంచి 123మంది విద్యార్థులు పాల్గొని అభయారణ్యాన్ని సందర్శించారు. ఫారెస్ట్ రేంజర్ చిత్తడి నేలలు-మడ అడవులు పరిరక్షణపై విద్యార్థులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్‌కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మడ అడవులు వివిధ జీవరాశులకు ఊపిరితిత్తుల వంటివన్నారు. అటవీశాఖ సిబ్బంది,వివిధ పాఠశాలల ఉపాధ్యాయులున్నారు.



కోరంగి అభయారణ్యంలో విద్యార్థుల బృందం

ఎస్‌బీఐ ఖాతాదారులకు అవగాహన సదస్సు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): యర్రవరంలో ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రం నిర్వాహకురాలు రమాప్రభ నేతృత్వంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎస్‌బీఐ బీఎంలు సురేష్, ఎలీషా నాయుడు మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువలో నగదు లావాదేవీలు, డ్వాక్రాలోన్లు, ఇన్సూరెన్స్, రైతులకు రుణాలు, ఖాతాదారుల సేవాకేంద్రం ద్వారా 44రకాల సేవలు అందిస్తున్నామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి

దేవీపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలో వెలగపల్లిలో కార్యకర్తలను కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని కూటమి ప్రభుత్వం రావడంతో కష్టా లు తీరతాయన్నారు. పోలవరం నిర్వాసితులకు వెయ్యి కోట్లు విడుదలచేసి గత మూడేళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్న నిర్వాసితుల కళ్లల్లో ప్రభుత్వం ఆనందం నింపిందన్నారు.

తెలుగునాడు ట్రేడ్ యూనియన్
కౌన్సిల్ ఏర్పాటుకు సన్నాహాలు

మోతుగూడెం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం గతంలో 1986లో తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్‌ని అప్పుడు లోయర్ సీలేరు, డొంకరాయి ఏపీ జెన్కో ఎంప్లాయిస్ మోతు గూడెంలో యూనియన్‌ను ప్రారంభించారు. యూనియన్ ప్రారంభానికి అప్పట్లో తెలుగుదేశం గవర్నమెంట్లో విద్యుత్‌శాఖ మంత్రి మోతుపల్లి నరసింహులు మో తుగూడెంలో యూనియన్ ప్రారంభించారు. ఆయన వెంట టీఎన్‌టీయూసీ నేత ఉమామహేశ్వరరావు 1986 లో లోయర్ సీలేరు తెలుగునాడు ట్రేడ్ యూనియన్, కౌన్సిల్ యూనియన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సెక్రటరీ వెంకటఅప్పారావు, డొంకరాయి (యూడీసీ) వాసం శెట్టి కమల్నాదం, రాష్ట్రనేత గతంలో తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నాయకులు పెంటకోట నాయుడు, ఏవీఎన్ మూర్తి పాల్గొన్నారు. అప్పట్లో డొంకరాయి మోతుగూడెం తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ నెంబర్స్ 80మంది ఉండేవారు. కాలక్రమేపీ ఈ యూని యన్ మరుగున పడింది. ఈ యూనియన్ సేవలు మరుగున పడ్డాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ మోతుగూడెంలో నాయకులు ఈ యూనియన్‌ను తిరిగి స్థాపించాలని ధృఢ సంకల్పంతో ఉన్నారు.

మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్‌కు సత్కారం



రంపచోడవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏజన్సీ ప్రాంతంలో గిరిజనులకు మంచి సేవలు అందించే అధికా రులకు స్థిరస్థాయిగా గుర్తింపు ఉంటుందని పదవీ విరమణ పొందిన మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ ఇ.జాన్‌రాజ్ అన్నారు. స్థానిక అర్క రిసార్ట్స్‌లో న్యాయవాదులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో జాన్‌రాజ్ దంపతులను ఘనంగా సత్కరించారు. న్యాయవాదులు కోలా సత్యప్రసాద్, ఏ ఆర్‌ఆర్ భగవాన్, సీహెచ్ సంతోష్‌కుమార్, ఎం.బాలసత్యనారాయణ, జిలాని, కె.బాలకృష్ణ, బి.వెంకటేశ్వరావు, శివరంజని, ఐటీడీఏ ఏపీవో డీఎన్వీ రమణ, పీహెచ్‌వో కె.చిట్టిబాబు, డిప్యూటీ తహసీల్దార్లు వి.రవీంద్రబాబు,కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తి

● పట్టుకుని బంధించిన గ్రామస్తులు
● పోలీసులకు అప్పగింత



గ్రామస్తులు పట్టుకున్న గుర్తు తెలియని వ్యక్తి

ఎటపాక, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో రేకుల కంచే దూకి ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిని గిరిజనులు పట్టుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి అల్లూరిజిల్లా ఎటపాక మండలం విస్సాపురం గిరిజన గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గ్రామంలోని సున్నం బాలరాజు ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించేందుకు యత్నించాడు. ఇంటిచుట్టూ కట్టిన రేకుల కంచే ఎక్కడంతో ఆ శబ్దానికి ఇంట్లోని వారు నిద్రలేచి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించాడు. గట్టిగా కేకులు వేయడంతో ఇరుగు పొరుగు గిరిజనులు లేచి ఆ వ్యక్తి కోసం గ్రామ మొత్తం గాలించారు. చివరకు గ్రామస్తులు ఆవ్యక్తిని గ్రామ శివారులో పట్టుకున్నారు. తర్వాత ఆ వ్యక్తిని పాఠశాలలో బం ధించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆవ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ అప్పలరాజును సంప్రదించగా ఆ వ్యక్తిది చత్తీస్‌గడ్ రాష్ట్రంగా చెబుతున్నాడని, మతిస్థిమితం లేని వ్యక్తిగా విచారణలో తేలిందని చెప్పారు.

94 శాతం పింఛన్ల పంపిణీ

దేవీపట్నం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీపట్నం, ఇందుకూరు, ఇందుకూరు పేట, శరభవరం, దేవారం, పాముగండి, చొప్పకొండ, పూడిపల్లి, మంటూరు తదితర గ్రామాలకు 4303 పింఛన్లకుగాను 4వేల పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. 94శాతం పింఛన్ల పంపిణీ పూర్తిచేశామని మిగతా వారికి సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు.

రాజవొమ్మంగి: మండలంలోని 6315మంది పింఛన్లకుగాను శనివారం 5937 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో యాదగిరేశ్వరరావు తెలిపారు. శరభవరం, కింద్ర గ్రామాల్లో సచివాలయ సిబ్బంది అందజేస్తున్న పింఛన్ల పంపిణీను ఎంపీడీవో తనిఖీ చేశారు. పింఛన్ల పంపిణీలో జాప్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందికి సూచించారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్‌సీసీ 18ఏ బెటాలియన్ కాకినాడ 2023-24 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి. మొత్తం 47మంది విద్యార్థుల్లో జేడీ విభాగానికి చెందిన విద్యార్థులు 24మందికిగాను 21మంది హాజరుకాగా జెడబ్ల్యు విభాగానికి 23మంది సామర్థ్య పరీక్షకు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయుడు డీవీ గోపాలకృష్ణ తెలిపారు. కాకినాడ నుంచి 18ఏ ఆర్మీ బెటాలియన్ లెఫ్టినెంట్ ఎం.అనిల్‌కుమార్, జేశ్విర్‌సింగ్, గంగాధర్ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ శిక్షకులు ఏఎన్‌వో సీహెచ్ శివకృష్ణ పాల్గొన్నారు.

రూ.30,500 పలికిన కొబ్బరికాయల కొట్టు వేలంపాట

కూనవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరసామి గుట్ట దగ్గర జరిగే మహాశివరాత్రి సందర్భంగా కొబ్బరికాయల కొట్టు వేలంపాటతో పాటు పులిహోర, ప్రసాదంకు సంబంధించిన వేలంపాట నిర్వహించారు. పళ్లూరు గ్రామానికి చెందిన బుచ్చయ్య ఈ రెండు వేలంపాటలను దక్కించుకున్నారు. కొబ్బరికాయల వేలంపాట రూ.30500కు దక్కించుకోగా పులిహోర, ప్రసాదం రూ.25500కు దక్కించుకున్నారు. ప్రతీఏటా వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఘనంగా జరుగుతుంది. అధికంగా గిరిజన భక్తులు హాజరవుతుంటారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు సాయిబాబు, (పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యారంగాన్ని పరిరక్షించాలి

కూనవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని యూటీఎఫ్ నాయకులు వెంకటనారాయణ అన్నారు. పాఠశాలల విద్యలో సంస్కరణల రేఉతో తీసుకువచ్చిన జీవోల వలన ప్రాథమిక పాఠశాల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విద్యా పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నాగేశ్వరరావు, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

శివుడు, కేశవుల ఆశీర్వాదంతో ఆ ప్రాంతమంతా సుభిక్షం

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
● శివ,కేశవ ప్రతిష్ఠ మహోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ నాయకులు

జగ్గంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని జ్యోతుల నవీన్ ఇంటి వద్ద ఇర్రిపాక గ్రామంలో ఏలేరు నది తీరాన వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కొలువైన శివకేశవుల ఆలయం వద్ద ఈనెల12 నుంచి 17వరకు నిర్వహించే శ్రీశ్రీశ్రీ శివకేశవ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం పోస్టరను టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది ఇదే నెలలో కోటి పార్థివ శివలింగాల మహారుద్రాభిషేకం నిర్వహించి ఏలేరు నదిలో నిక్షిప్తం చేసిన ప్రదేశంలో శ్రీశ్రీశ్రీ శివకేశవుల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రాచీన ఇతిహాసాల్లో శివుడు కేశవుడు ఒక స్థలంలో ఉండి భక్తులను ఆశీర్వదిస్తే ఆ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందని ప్రగాఢ నమ్మకంతో భక్తులు విశ్వసిస్తారని ఈ పాంతంలో శివ కేశవులను ప్రతిష్ఠిస్తున్నామన్నారు. ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, అడపా భరత్‌కుమార్, భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు, బద్ది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య యూనివర్శిటీ వర్క్‌షాప్

గండేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఎలక్ట్రికల్ జనరేటర్స్, ఎక్సైటేషన్ సిస్టమ్స్ అండ్ గవర్నింగ్ సిస్టమ్స్ అనే అంశంపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీజెన్‌కో ఇబ్రహీపట్నం ఎస్.శివప్రసాద్ ఉపన్యాసం చేశారు. విద్యార్థులకు వివిధ రకాల జనరేటర్లు, ఎక్సైటర్లు, ఆటోమేటిక్ వోల్టేజ్ రెగ్యులేటర్లు వాటి ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ డాక్టర్ సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంబీఏ విభాగంలో ముఖ్యఅతిథిగా ఉపన్యాసం ఇచ్చారు.

93.04శాతం పింఛన్లు పంపిణీ

గండేపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శనివారం సాయంత్రం 4గంటలకు 93.04 శాతం పూర్తిచేసినట్లు ఎంపీడీవో నాతి బుజ్జి తెలిపారు. 8365మందికి 7,783మందికి పింఛన్ల సొమ్ము రూ.3.55కోట్లు అందించామన్నారు. గండేపల్లి మండలాన్ని అగ్రస్థానంలో నిలిపిన పెన్షన్ పంపిణీ అధికారులను ఎంపీడీవో అభినందించారు.

గంజాయిపై ఉక్కుపాదం: ఎస్‌ఐ

కోటనందూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మాదక ద్రవ్యాలు అమ్మినా, కాల్చినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ టి.రామకృష్ణ అన్నారు. కాకరాపల్లిలో మాదకద్రవ్యాలపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దులో ఉండడంతో యువత తప్పుడు అలవాట్లకు బానిస అవుతోందన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఉపసర్పంచ్ వాసం నాగేశ్వరరావు, సామినీడి కృష్ణార్జున, వాసం శ్రీనువాస్, తాతాజీ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ చైర్మన్‌గా బాబ్జి

కిర్లంపూడి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి వాకర్స్‌క్లబ్ చైర్మన్‌గా నైదాన బాబ్జి అనే రఘు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం కిర్లంపూడి కాలేజీగ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ముచ్చటగా మూడోసారి ఆయన్ను ఎన్నుకున్నారు. ఏకగ్రీవానికి కృషిచేసిన పెంటకోట మూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ముద్రగడ దృష్టికి తాగునీటి సమస్యలు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం దృష్టికి శనివారం ప్రత్తిపాడు మండల రైతులు తాగునీటి సమస్యలు తీసుకువెళ్లారు. ఒమ్మంగి, రాచపల్లి, ధర్మవరానికి చెందిన రైతులు కిర్లంపూడి వెళ్లే ఏలేరు ఎడమ కాలువ నీటిని తమ గ్రామాలకు మళ్లించాలని కోరారు. ఏలేశ్వరం నుంచి విశాఖపట్నం వెళ్ళే ఏలేరు ఎడమ కాలువ నీటిని తమ గ్రామ పంట పొలాలకు కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని రైతులు ముద్రగడకు తెలిపారు.

భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

తొండంగి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): దివీస్ పరిశ్రమ నుంచి సముద్రంలోకి పైప్‌లైన్ వేస్తున్న నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రికి ఒంటిమామిడి పోలీసుస్టేషన్‌కు సిబ్బంది భారీగా చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. గతంలో ఇదేరీతిలో బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదాపడ్డంతో తిరిగి పైప్‌లైన్ వేసేందుకు కంపెనీ సిద్ధమైంది.

వైసీపీలో అలా.. కూటమిలో ఇలా..





కాకరాపల్లి శివారులో గతంలో గుంతల రోడ్డు.. కూటమి ప్రభుత్వంలో అందంగా రోడ్డు

● తుని-నర్సీపట్నం రహదారిపై రోడ్డు నిర్మాణంతో తొలగిన ఇక్కట్లు

కోటనందూరు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): తుని-నర్సీపట్నం రహదారిపై కాకరాపల్లి నుంచి అనకాపల్లి జిల్లా గన్నవరం వరకు రోడ్డు అంతా శిథిలావస్థకు చేరుకుని పెద్దగుంతలతో తరుచూ ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. వైసీపీ హయాంలో ఐదేళ్లలో కనీసం మరమ్మతులుచేయకపోవడంతో పెద్ద వాహనాలు గోతుల్లో పడి తీవ్రఇబ్బందులు పడేవారు. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా స్థానికంగానే ఉన్నా అసలు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంచి రోజులువచ్చాయి. ఈరోడ్డు నిర్మించడంతో ఇబ్బందులు తొలిగాయని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. తుని-నర్సీపట్నం రహదారిపై తుని వరకు రోడ్డును పూర్తిస్థాయిలో ఇబ్బందులు లేకుండా చేశారు.

రౌతులపూడి బీసీ కాలనీలో రహదారి నిర్మాణంతో సంతోషం





గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామంలో రోడ్డు దుస్థితి.. కూటమి ప్రభుత్వం వచ్చాక సీసీ రోడ్డు

రౌతులపూడి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో బీసీ కాలనీకి చెందిన ప్రధాన రహదారి ఇది. వైసీపీ హయాంలో ఐదేళ్లు దీన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు. వర్షాలు పడినప్పుడు బురదమయంగా మారి ప్రజలు నడిస్తే కాళ్లు దిగబడిపోయి అవస్థలు పడేవారు. చిన్నపాటి వ్యవసాయ వస్తువులను గృహాలకు తరలించేందుకు ఇబ్బందులు పడే వారు. ఇదే రహదారిలో పాఠశాల ఉండడంతో విద్యార్థులు నానా కష్టాలు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈరహదారి నిర్మించడంతో బీసీ కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సబ్‌జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో భాష్యం విద్యార్థుల హవా

జగ్గంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం భాష్యం పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం నిర్వహించిన భాష్యం సబ్‌జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో జగ్గంపేట భాష్యం విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, జగ్గంపేట ఎస్‌ఐ రామలింగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయన్నారు. ఈపోటీల్లో భాష్యం విద్యా సంస్థలకు చెందిన జగ్గంపేట, ఏలేశ్వరం, సామర్లకోట, పిఠాపురం, తుని జట్లు పాల్గొన్నాయి. జగ్గంపేట భాష్యం విద్యార్థులు సీనియర్స్ వాలీబాల్ విభాగంలో, జూనియర్స్ విభాగంలో షటిల్, క్యారమ్స్‌లో మొదటి స్థానంలో, సీనియర్స్ ఖోఖో, జూనియర్స్ విభాగంలో కబడ్డీలో రెండో స్థానంలో నిలిచారన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌ఛార్జ్ గోవిందరాజు అభినందనలు తెలిపారు. కార్యక్రమలో ఏలేశ్వరం ప్రిన్సిపాల్ అనిల్, సామర్లకోట ప్రిన్సిపాల్ సూర్య, పిఠాపురం ప్రిన్సిపాల్ వేణు, తుని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఐదు బ్రాంచ్‌లు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న చలో ఎమ్మార్పీఎస్ ర్యాలీ

కిర్లంపూడి, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల7న జరిగే చలో ఎమ్మార్పీఎస్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు మాదిగ పిలుపునిచ్చారు. శనివారం రాజుపాలెంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అయన టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు అనంతరపు రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శి దూలపల్లి వెంకటరమణ, ఇందన చిన్నారి, ఆరుగుల పండు, కొల్లి నాని, పెదపాటి రమణ పాల్గొన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

కిర్లంపూడి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ శనివారం వీరవరానికి చెందిన కొప్పన సత్యనారాయణ కుటుంబాన్ని, ఆదిరెడ్డి నాగేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించారు. మాదారపు వీరబాబు, జయబాబు, రేవూరి శ్రీనివాస్, బచ్చల రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలించిన జ్యోతుల నవీన్

కిర్లంపూడి, ఫిబ్రవరి 1(ఆంధ్ర జ్యోతి): రాజుపాలెం నుంచి జగ్గం పేట మండలం రామవరం వెళ్లే రహదారి పనులను శనివారం టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు నిర్మించాలన్నారు. అనంతరం తామరాడ వద్ద పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ రూ.20లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్ల పనులు పరిశీలించారు. ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, వీరంరెడ్డి కాశీబాబు, చదరం చంటిబాబు, అనుకుల శ్రీకాంత్, జ్యోతుల రాంబాబు, కాళ్ల వెంకటేష్, బస్వా చినబాబు, గంధం ఈశ్వరరావు, గొడే దొరబాబు, గొల్లపల్లి సూరిబాబు, కుర్లచినబాబు పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ



అన్నవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి):రత్నగిరివాసుడైన సత్యదేవుడి వారాంతపు సేవయిన ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. ఈవో సుబ్బారావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని డీఎస్పీ శ్రీహరిరాజు అన్నారు. స్థానిక భాష్యం స్కూల్‌లో భాష్యం సబ్‌జోనల్ క్రీడలు నిర్వహించగా జిల్లాలోని వివిధ బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఖోఖో తదితర క్రీడా పోటీలను డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, ఎస్‌ఐ రామలింగేశ్వరరావు ప్రారంభించారు. జోనల్ ఇన్‌చార్జ్ గోవిందరాజు, ప్రిన్సిపాల్‌లు గొల్లపల్లి అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సత్యనారాయణపాల్గొన్నారు.

ప్రత్తిపాడులో సత్తెమ్మ తల్లి జాతర ప్రారంభం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు గ్రామదేవత శ్రీసత్తెమ్మతల్లి జాతరమహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని గద్దెపై ప్రతిష్ఠించి గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అమ్మవారి పూల అలంకరణ, ఆలయ ముస్తాబు ఆకట్టుకున్నాయి. జి.రాగంపేట కళాకారుల బృందం వెంకన్నబాబు కథ ప్రదర్శనలు నిర్వహించారు. ఆది, సోమ, మంగళవారాల్లో రామాంజనేయ యుద్ధం, సత్య హరిశ్చంద్ర నాటికల్లో వార్ సీన్ల ప్రదర్శన, నాట్య విభావరి, ఆర్కెస్ట్రా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భీష్మఏకాదశి పర్వదినం పోస్టర్ ఆవిష్కరణ

అన్నవరం, ఫిబ్రవరి1(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో భీష్మఏకాదశి పురస్కరించుకుని చేపట్టే పూజ కార్యక్రమాలపై ప్రచారం కల్పించడంలో భాగంగా ఈవో సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ శనివారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈనెల 8న భీష్మఏకాదశిపురస్కరించుకుని సౌకర్యాల కల్పనపై ఇప్పటికే సిబ్బంది, ఇతరశాఖల అధి కారులతో సమీక్ష సమావేశాలు ముగిశాయి. కార్తీకమాస పర్వదినాల్లో చేపట్టిన ఏర్పాట్లకుమిన్నగా భీష్మఏకాదశి ఏర్పాట్లపై అధికారులు దృష్టిసారించారు.

జాబ్‌మేళాలో 300మంది ఎంపిక

రంపచోడవరం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలతో శనివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రేరణ జాబ్ మేళా నిర్వహించినట్లు డీఎస్పీ సాయిప్రశాంత్ తెలిపారు. ఇన్నోవ్సోర్స్ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 387మంది హాజరుకాగా 300మంది ఎంపికయ్యారు.

కేంద్ర బడ్జెట్ ఆమోదయోగ్యం

జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ ఆమోదయోగ్యంగా ఉందని జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్నివర్గాలు, రంగాలకు ఊతమిచ్చేలా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రకాలుగా ఆదుకునేలా బడ్జెట్ రూపొందించడం హర్షణీయమన్నారు. ముఖ్యంగా పోలవరం ఎత్తు పెంచడానికి, దానికి కావాల్సిన నిధులు ఇచ్చేందుకు అంగీకరించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎంతో తోడ్పాటునందిస్తుందన్నారు. కిసాన్ క్రెడిట్‌కార్డుల పరిమితి రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం ద్వారా 7.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కొత్త ఆదాయపు పన్ను విధానం ద్వారా మధ్య తరగతి ప్రజలకు ఊరట లభించిందన్నారు. ఎంఎస్‌ఎంఈలకు రూ.1.5లక్షల కోట్లు కేటాయించడం గొప్ప విషయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్,విశాఖ పోర్టుకు భారీ నిధులు కేటాయించారన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్ రూపొందించారని రమేష్ పేర్కొన్నారు.

ద్రవ్యోల్బణం మాట ఏంటి

ఐ.ప్రసాదరావు యూటీఎఫ్ జిల్లా నాయకుడు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి నిర్మాల సీతారామన్ నిరుద్యోగం, ద్రవ్యోల్బం అరికట్టేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారో ప్రస్తావించకపోవడం శోచనీయం. కొంత వరకు మధ్యతరగతి వర్గానికి ఆదాయ పన్ను మినాహాయింపులు కల్పించినా అధిక ధరల నియంత్రణకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం బాధాకరం. ముఖ్యంగా రూపాయి విలువ పతనంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపలేదు

ప్రజారంజక బడ్జెట్

చిలుకూరి రామ్‌కుమార్,

బీజేపీ జిల్లా పూర్వపు అధ్యక్షుడు

కేంద్ర బడ్జెట్ ప్రజారంజక బడ్జెట్. రూ.12లక్షల వరకు ఆదాయంపై పన్ను మినహాయింపు, మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులకు ఎంతో ఊరటనిచ్చే అంశం. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉత్పత్తి, ఉపాధి కల్పనకు విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం చేపట్టిన కేటాయింపులు వృద్ధిరేటును మరింత పెంచగలదు. గ్రామీణ, చిన్న పట్టణాల్లో పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించడం ద్వారా గ్రామీణ యువత ఉపాధి కోసం నగరాలకు వలసలు వెళ్లడం ఉండదు.

ఇది ఎన్నికల బడ్జెట్

-కర్నాకుల వీరాంజనేయులు, రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జగ్గంపేట, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి మొండి చెయ్యి చూపించారన్నారు. రాజధానికి నిధులు కానీ, ప్రత్యేక హోదా ఊసే లేదన్నారు. ఆదాయ పన్ను రాయితీ ఇచ్చినా, పెరిగే ధరలతో మధ్య తరగతి జేబులు ఖాళీ అవుతాయన్నారు. వస్తు సేవల పన్ను, పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించలేదని, దీంతో సామాన్యుడికి పెను భారంగా మారుతుందన్నారు.